క్లుప్తంగా

పీహెచ్‌సీలో డీవైఎంహెచ్‌ఓ తనిఖీ

రాచర్ల: మండలంలోని అనుమలవీడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మార్కాపురం డీవైఎంహెచ్‌ఓ పద్మావతి గురువారం తనిఖీ చేశారు. తొలుత ఆరోగ్య కేంద్ర సిబ్బంది వివరాలు తెలుసుకుని రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వైద్యులు సమయపాలన పాటిస్తూ, రోగులకు అందుబాటులో ఉండి వైద్యసేవలు అందించాలన్నారు. పీహెచ్‌సీ డాక్టర్ కమలాదేవి నాలుగేళ్లుగా పని చేస్తున్నా గర్భిణులకు ఎలాంటి వైద్యం అందించడం లేదని, తమను మానసికంగా బాధపెడుతున్నారని సిబ్బంది ఆరోపించడంతో లిఖిత పూర్వకంగా ఫిర్యాదు తీసుకున్నారు. కార్యక్రమంలో డాక్టర్లు కమలాదేవి, భానుకుమార్ రెడ్డి, సూపర్‌వైజర్లు ప్రసాదు, ఫార్మసిస్ట్ శివరామకృష్ణ, స్టాఫ్ నర్సులు పాల్గొన్నారు.

రైతులకు సాంకేతిక సమాచారం తెలియజేయాలి



మాట్లాడుతున్న శాస్త్రవేత్త రమేష్

బేస్తవారిపేట: రైతులు సాగు చేసే పంటలపై ఎప్పటికప్పుడు సాంకేతిక సమాచారం అందించాలని స్థానిక వ్యవసాయాధికారులకు దర్శి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త జి.రమేష్ సూచించారు. గురువారం స్థానిక జెడ్పీ బాలుర హైస్కూల్ ఆవరణలో మార్కాపురం, గిద్దలూరు సబ్‌డివిజన్ పరిధిలోని రైతు సేవా కేంద్రం సిబ్బంది, ఏఓలు, ఏఈఓలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. సీఎల్ఎస్ యాప్‌లో పంటలకు సంబంధించిన ఫొటోలు అప్‌లోడ్ చేయాలని చెప్పారు. కార్యక్రమంలో శాస్త్రవేత్త సంధ్యారాణి, ఏడీఏ బాలాజీనాయక్, ఏఓలు, ఏఈఓలు, వీఏఏలు పాల్గొన్నారు.

లారీ ఢీకొని ఒకరికి గాయాలు



సంఘటనా స్థలంలో క్షతగాత్రుడు

కంభం: ద్విచక్ర వాహనదారుడిని లారీ ఢీకొనడంతో ఒకరికి గాయాలైన సంఘటన స్థానిక కందులాపురం కూడలిలో గురువారం చోటుచేసుకుంది. మార్కాపురం వైపు నుంచి కంభం వైపు వెళ్తున్న లారీ.. స్థానిక అర్బన్ కాలనీ నుంచి ఓ సందులో గుండా హైవేపైకి వస్తున్న బైక్‌ను ఢీకొట్టింది. దీంతో బైకిస్ట్‌కు కాలు విరిగింది. క్షతగాత్రుడిని కంభం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు నమోదు చేసుకున్నారు.

మార్కాపురం తహసీల్దార్‌కు సన్మానం



తహసీల్దార్ చిరంజీవిని సన్మానిస్తున్న ఎన్జీఓ సంఘ నాయకులు

మార్కాపురం రూరల్: మార్కాపురం సబ్ కలెక్టర్ త్రివినాగ్ చేతులమీదుగా డివిజన్ స్థాయిలో ఉత్తమ తహసీల్దార్‌గా ప్రశంస పత్రం అందుకున్న చిరంజీవిని గురువారం ఎన్జీఓ సంఘ నాయకులు ఘనంగా సన్మానించారు. భవిష్యత్తులో మరిన్ని అవార్డులు పొందాలని ఆకాంక్షించారు. జేఏసీ చైర్మన్ డాక్టర్ బీవీ శ్రీనివాసశాస్త్రి, సబ్ ఎంప్లాయ్‌మెంట్ ఆఫీసర్ రామచంద్రారెడ్డి, సబ్‌ట్రెజరీ ఆఫీసరు కెనడీ, అసోసియేషన్ నాయకులు వి.శ్రీనివాస్, సబ్‌కలెక్టర్ సీసీ సుబ్బారావు, రవికిరణ్, విజయకుమారి, సరస్వతి, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.





గిద్దలూరు : వెల్లుపల్లె వద్ద వర్షం నీటిలో నానుతున్న పప్పుశనగ, జొన్న





అనుములపల్లె, గౌతవరం వద్ద ప్రవహిస్తున్న లోతువాగు, పితూరువాగు

భారీ వర్షం.. అపార నష్టం

- వాయుగుండం ప్రభావంతో రెండు రోజులుగా వర్షాలు
- గురువారం ఉదయం మూడు గంటల పాటు దంచికొట్టిన వాన
- గిద్దలూరు నియోజకవర్గంలో భారీగా దెబ్బతిన్న పంటలు
- పెట్టుబడి చేతికొచ్చే పరిస్థితి కూడా లేదని రైతుల ఆందోళన

బేస్తవారిపేట:

ఫెంగల్ తుఫాన్ తీరం దాటి వాయుగుండంగా మారడంతో గత రెండు రోజులుగా గిద్దలూరు నియోజకవర్గంలో ఎడతెరపిలేకుండా వర్షం కురుస్తోంది. కోత దశలో ఉన్న వరిపంట నేలకొరిగింది. రెండు రోజులుగా పంట నీటిలో నానుతుండటంతో రైతులు తీవ్రంగా ఆందోళన చెందుతున్నారు. లేత మొక్కజొన్న, పప్పుశనగ పొలాల్లో భారీగా నీరు చేరింది. బేస్తవారిపేట మండలంలో పంటలపై వర్షం తీవ్ర ప్రభావం చూపింది.

గిద్దలూరు రూరల్: మండలంలోని అంబవరం, వెల్లుపల్లె, సంజీవరాయుడుపేట, ముండ్లపాడు, ఓబులాపురం, ఉయ్యాలవాడ, కె.ఎస్.పల్లె గ్రామాలల్లో వరి, పప్పుశనగ, మొక్కజొన్న, కంది, మిర్చి, జొన్న, పొగాకు, వివిధ రకాల పంటలు నీట మునిగాయి. మిరప తోటలకు ఎకరాకు రూ.లక్ష వరకు పెట్టుబడి పెట్టామని, చేలు నీటమునగడంతో మొక్కలు చనిపోయే స్థితికి వచ్చాయని రైతులు తీవ్రంగా కలత చెందుతున్నారు. మండలంలో పప్పుశనగ 1260 హెక్టార్లలో సాగు చేయగా అందులో 700 హెక్టార్లలో దెబ్బతింది. పొగాకు 952 హెక్టార్లకుగాను 450, వరి 223 హెక్టార్లకు గాను 70, నువ్వులు 51 హెక్టార్లకుగాను 51, మొక్కజొన్న 540 హెక్టార్లలో సాగు చేయగా 540, ఉలవ 127 హెక్టార్లుకు గాను 80, వరిగ 6 హెక్టార్లకుగాను 6 హెక్టార్లు, మినుము 30 హెక్టార్లుకుగాను 30 హెక్టార్లలో పూర్తిగా దెబ్బతింది.

రాచర్ల: మండలంలో గురువారం ఉదయం కురిసిన భారీ వర్షానికి వరద నీరంతా పంట పొలాలను ముంచెత్తింది. అత్యధికంగా పప్పు శనగ, మిర్చి, టమోటా, నువ్వులు, పత్తి పొలాల్లో భారీగా వర్షం నీరు నిల్వ చేరాయి. మిర్చి, పప్పు శనగ, టమోటా పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. అనుములవీడు, గౌతవరం, అనుములపల్లె, గంగంపల్లె, రాచర్ల గ్రామాల్లో దాదాపు 300 ఎకరాల్లో పప్పుశనగ దెబ్బతిన్నట్లు అంచనా. మండలంలో సుమారు వెయ్యి ఎకరాలకు పైగా పంటలకు నష్టం వాటిల్లింది. భారీ వర్షం కారణంగా లోతు వాగు, పితూరువాగు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. వర్షం కారణంగా 5 ఎకారల్లో శనగ దెబ్బతిని రూ.లక్ష మేర నష్టం వాటిల్లిందని గంగంపల్లెకు చెందిన రైతు ఎద్దుల పుల్లారెడ్డి కన్నీటి పర్యంతమయ్యారు.

కొమరోలు: మండలంలో గత 3 రోజులుగా ఎడతెరపి లేకుండా వర్షం కురుస్తుండటంతో ఇప్పటికే 300 హెక్టార్లకు పైగా విస్తీర్ణంలో పంటలు దెబ్బతిన్నాయి. గురువారం కురిసిన వర్షానికి పంట నష్టం మరింత పెరిగింది. వాగులు, వంకలు మరోసారి ఉగ్రరూపం దాల్చాయి. సూరవారిపల్లె, బాదినేనిపల్లె గ్రామాల వద్ద పులి వాగు ఉధృతితో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. మండలంలోని పప్పుశనగ, పొగాకు, నువ్వులు, మినుము, వరి పంటలు పూర్తిగా దెబ్బతినే అవకాశం ఉందని వ్యవసాయశాఖ అధికారులు పేర్కొన్నారు. పొలాల్లో నీటిని బయటకు పంపితే నష్టం తగ్గించుకోవచ్చని ఏఓ రాజశ్రీ సూచించారు.



రాచర్ల : అనుములపల్లెలో నీట మునిగిన పప్పు శనగ



బేస్తవారిపేట : పెంచికలపాడు వద్ద మొక్కజొన్న పొలంలో నిలిచిన నీరు



కొమరోలు : వర్షం నీటితో నిండి ఉన్న గోపాలునిపల్లె రహదారి

నేటి నుంచి రెవెన్యూ సదస్సులు

గిద్దలూరు రూరల్:

మండలంలో గ్రామ రెవెన్యూ సభల వివరాలను తహసీల్దార్ ఎం.ఆంజనేయరెడ్డి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 6వ తేదీన అంబవరం, వెంగళరెడ్డిపల్లె, 9న మోడంపల్లె, 10న చట్టిరెడ్డిపల్లె, కొండపేట, 11న క్రిష్ణంశెట్టిపల్లె వన్ రెవిన్యూ పరిధి, 12 న క్రిష్ణంశెట్టిపల్లె టూ రెవిన్యూ పరిధి, 13న కొత్తకోట, 16న కొమ్మునూరు, నల్లగట్ల, 17న వెల్లుపల్లె, 18న సంజీవరాయుడుపేట, 19న ఓబులాపురం, 20న గడికోట, 21న దేవనగరం, 23న ఉయ్యాలవాడ, సూరేపల్లె, 24 న ఆదిమూర్తిపల్లె, 26న పట్టణంలోని పాత తహసీల్దార్ కార్యాలయం, 27న పాములపల్లె, కొత్తపల్లె, 28న తిమ్మాపురం, 30న తంబళ్లపల్లె, త్రిపురాపురం, 31న పాదలకుంటపల్లె, జనవరి 2వ తేదీన నరవ, 3న కొంగలవీడు, 4న కంచిపల్లె, 5న కె.బయనపల్లె, 6న ముండ్లపాడు, 7న బురుజుపల్లె, 8న వెంకటాపురంలో గ్రామసభలనులు నిర్వహించనున్నట్లు వివరించారు.

బేస్తవారిపేట: మండలంలోని శుక్రవారం నుంచి జనవరి 8వ తేదీ వరకు రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ జితేంద్రకుమార్ తెలిపారు. 6న జేబీకే పురం, 7న సోమవారిపేట, ఒందుట్ల, 10న చెట్టిచర్ల, 11 పూసలపాడు, పందిళ్లపల్లె, 13న సలకలవీడు, కలగొట్ల, కొత్తపల్లె, 17న చిన్న ఓబినేనిపల్లె, పోతవరం, 18న పెద్ద ఓబినేనిపల్లె, రెట్లపల్లె, 19న పిటికాయగుళ్ల, వంగపాడు, 20న జేసీ అగ్రహారం, పాత, కొత్త మల్లాపురం, 21న బసినేపల్లె, గంటాపురం, చెరుకుపల్లె, జెన్నివారిపల్లె, ఖాజీపురం, 24న ఎంపీ చెరువు, కొత్తపేట, అక్కపల్లె, 26న గలిజేరుగుళ్ల, శింగరపల్లె, బాలేశ్వరపురం, చెన్నుపల్లె, హనుమాయపల్లె, బార్లకుంట, 27న కోనపల్లె, శింగసానిపల్లె, పోగుళ్ల, బత్తువానిపల్లె, 28న బేస్తవారిపేట, పాపాయిపల్లె, జనవరి 2న చింతలపాలెం, నేకునాంబాద్, 3న డీకే పురం, 4న పీవీ పురం గ్రామాల్లో సదస్సులు నిర్వహించనున్నట్లు వివరించారు.

కంభం: మండలంలో రెవెన్యూ గ్రామ సభల నిర్వహణ తేదీలను తహసీల్దార్ కిరణ్ గురువారం వెల్లడించారు. 6న కంభం, 9, 10వ తేదీల్లో లక్ష్మీకోట రెవిన్యూ పరిధి, 11న రావిపాడు, 12న హజరత్‌గూడెం, కాగితాలగూడెం, 13న పోరుమామిళ్లపల్లె, 16, 17న చిన్నకంభం రెవెన్యూ పరిధి, 18, 19వ తేదీల్లో లింగాపురం రెవెన్యూ పరిధి, 20, 21వ తేదీల్లో తురిమెళ్ల రెవెన్యూ పరిధి, 23, 24వ తేదీల్లో యర్రబాలెం రెవెన్యూ పరిధి, 26న జంగంగుంట్ల, 27న కందులాపురం రెవెన్యూ పరిధి, 28న నడింపల్లి, 30న ఔరంగాబాద్‌లో గ్రామ సభలు నిర్వహించనున్నట్లు వివరించారు.

పొదిలి రూరల్: మండలంలో రెవెన్యూ సదస్సుల నిర్వహణ తేదీలను తహసీల్దార్ ఎంవీ కృష్ణారెడ్డి గురువారం ప్రకటించారు. శుక్రవారం మల్లవరం, 10న జాఫ్లాపురం, కంభాలపాడు, 11న దాసళ్లపల్లి, 12న ఓబులక్కపల్లి, నందిపాలెం, 13న సూదనగుంట, 16న కేశవబొట్లపాలెం,పాములపాడు, 17న ఉప్పలపాడు, 18న లక్ష్మీపురం, తలమళ్ల, 19న ఏలూరు, 20న ఆముదాలపల్లి, తీగదుర్తిపాడు,చింతగుంపల్లి, 21న పొదిలి, 24న అక్కచెరువు, జువ్వలేరు, 26న ఈగలపాడు, కుంచేపల్లి, 27 మాదాలవారిపాలెం,రామాయణకండ్రిక, 28న దొండ్లేరు,సలకనూతల, జూన్ 2వ తేదీ మూగచింతల, కొండాయపాలెం, 3న తుమ్మగుంట, 4న టి.సల్లూరు, 7న అన్నవరం, రాములవీడు, 6న నిమ్మవరంలో సదస్సులు నిర్వహించనున్నట్లు వివరించారు.

జనన, మరణాల నమోదులో జాగ్రత్తలు పాటించాలి




అనుములపల్లెలో 132 కేవీ సబ్‌స్టేషన్‌ను తనిఖీ చేస్తున్న సబ్‌కలెక్టర్ త్రివినాగ్

రాచర్ల: లేట్ జనన, మరణాల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేసే సమయంలో జాగ్రత్తలు పాటించాలని మార్కాపురం సబ్‌కలెక్టర్ సహదిత్ వెంకట త్రివినాగ్ సూచించారు. మండలంలోని అనుములపల్లె గ్రామ సచివాలయాన్ని గురువారం తనఖీ చేశారు. దరఖాస్తుదారులు ఆఫిడవిట్‌లో పొందుపరిచిన పేర్లు, ఆన్‌లైన్‌లో నమోదు చేసే పేర్లు ఒకేలా కాకుండా ఇష్టమొచ్చినట్లు నమోదు చేసి పంపిస్తున్నారంటూ డిజిటల్ అసిస్టెంట్‌పై అగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం అనుములపల్లె గ్రామ సమీపంలోని 697, 737 సర్వే నంబర్‌లోని 9.5 ఎకరాల్లో 132 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌కు సంబంధించిన భూమిని పరిశీలించారు. తహసీల్దార్ వెంకటేశ్వర్లు, ఆర్ఐ జాషువ, మండల సర్వేయర్ అంజనేయులు, పంచాయతీ కార్యదర్శి అనిల్‌కుమార్, వీఆర్వో వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు మరమ్మతుల్లో నాణ్యత డొల్ల!





కొండేపల్లి రోడ్డులో తారు లేచిపోవడంతో కనిపిస్తున్న కంకర

- రెండు రోజులకే పైకి తేలిన కంకర

మార్కాపురం: మార్కాపురం పట్టణంలోని కాలువకట్ట మీదుగా కొండేపల్లి రోడ్డుకు వెళ్లే రహదారిలో ఇటీవల చేపట్టిన మరమ్మతుల్లో నాణ్యత డొల్లేనని తేలిపోయింది! కాంట్రాక్టర్ సుమారు రూ.8 లక్షల వ్యయంతో ఒక కి.మీ మేర చేపట్టిన ప్యాచ్‌వర్క్‌లో నాణ్యతకు తిలోదకాలు ఇవ్వడంతో తారు వేసిన రెండురోజులకే కంకర బయటపడింది. ఈ మార్గంలో ప్రయాణించే అమ్మవారిపల్లి, కొండేపల్లి, రామచంద్రాపురం గోరుగుంతలపాడుతోపాటు పలువురు వాహనదారులు ఆశ్చర్యపోయారు. ఆర్‌అండ్‌బీ అధికారులు రోడ్డు మరమ్మతు పనులను పరిశీలించారా లేదా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ విషయమై మార్కాపురం ఆర్‌అండ్‌బీ ఏఈ సందీప్‌ను వివరణ కోరగా తారు రోడ్డు వేసిన రాత్రి వర్షం కురిసి కంకర లేచిందని, మళ్లీ అక్కడ మరమ్మతులు చేయిస్తామని చెప్పారు.

టీచర్ మృతిపై ప్రభుత్వం స్పందించాలి



ఎంఈఓకు వినతిపత్రం అందజేస్తున్న యూటీఎఫ్ నాయకులు

బేస్తవారిపేట: రాయచోటిలోని కొత్తపల్లి ఉర్దూ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు ఇజాజ్ అహ్మద్‌పై విద్యార్థులు దాడిచేసిన సంఘటనపై ప్రభుత్వం వెంటనే స్పందించాలని యూటీఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ సంఘటనపై గురువారం ఎంఈఓ సీహెచ్ రమణారెడ్డికి వినతి పత్రం అందజేశారు. పాఠశాల ఆవాస ప్రాంతంలో గుట్కా, గంజాయి సంస్కృతి ఉన్నట్లు తెలుస్తోందన్నారు. ఈ విష సంస్కృతికి బాధ్యత ప్రభుత్వమే వహించాలన్నారు. ఇటీవల జరిగిన కొన్ని సంఘటనల్లో కూడా బయటి వ్యక్తులు పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులపై దాడికి పాల్పడ్డారన్నారు. పతన సంస్కృతిని గాడిలో పెట్టాల్సిన ప్రభుత్వం తక్షణమే స్పందించాలని, దోషులను కఠినంగా శిక్షించాలని, ఉపాధ్యాయుడు ఇజాజ్ అహ్మద్ కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా సహాధ్యక్షుడు ఐవీ రామిరెడ్డి, మండల అధ్యక్షుడు లక్ష్మీరెడ్డి, ప్రధాన కార్యదర్శి డి.కాశింవలి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యతోనే వివేకం, విజ్ఞానం

- ఎస్సై రాజమోహన్‌రావు



మాట్లాడుతున్న ఎస్సై రాజమోహన్‌రావు

మార్కాపురం రూరల్: విద్యార్థుల్లో విజ్ఞానం, వివేకానికి చదువు దోహదపడుతుందని, కష్టపడి చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని టూటౌన్ ఎస్సై డాక్టర్ రాజమోహన్‌రావు పేర్కొన్నారు. గురువారం రాయవరం సమీపంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల బాలికల పాఠశాలలో ఆన్‌లైన్ మోసాలు, డ్రగ్స్ వాడకం, రోడ్డు ప్రమాదాలు, ర్యాగింగ్ చట్టాలపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. లైసెన్సు లేకుండా వాహనాలు నడపవద్దని చెప్పారు. బాల్య వివాహాల కట్టడికి సహకారం అందించాలని కోరారు. పట్టణ ఎస్సై సైదుబాబు మాట్లాడుతూ సైబర్ నేరాలపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రహదారి భద్రతా నియమాలు పాటిస్తే ప్రమాదాలను నివారించవచ్చన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్, విద్యార్థినులు పాల్గొన్నారు.

నేల కాలుష్యం కాకుండా చూడాలి

- వ్యవసాయ శాఖ జేడీ శ్రీనివాసరావు



కొనకనమిట్ల : రైతులకు భూసార పరీక్ష పత్రాలు అందజేస్తున్న జేడీ

కొనకనమిట్ల: నేల కాలుష్యం కాకుండా చూడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని వ్యవసాయ శాఖ జేడీ శ్రీనివాసరావు అన్నారు. గురువారం మండల కేంద్రం కొనకనమిట్లలో ప్రపంచ నేల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జేడీ మాట్లాడుతూ నేల అధికంగా కాలుష్యం అవుతున్నందున ప్రజలు, రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. రైతులు విచ్చలవిడిగా రసాయనిక ఎరువులు, పురుగు మందులు వాడుతున్నందున నేల నిర్జీవం అవుతోందన్నారు. భూసార పరీక్షల అనంతరం సిఫారసు చేసిన ఎరువులు వాడాలని రైతులకు సూచించారు. కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త కె.రమేష్ మాట్లాడుతూ.. రైతులు తప్పనిసరిగా పొలంలో పచ్చిరొట్ట పైరు సాగుచేయాలని, జింక్, సూక్ష్మధాతువులు వాడాలన్నారు. అనంతరం పలువురు రైతులకు భూసార పరీక్ష పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో దర్శి ఏడీఏ బాలాజీ నాయక్, భూసార పరీక్ష కేంద్రం సహాయకులు సుచరిత, స్థానిక ఏఓ ప్రసన్న రంగలక్ష్మి, ఏఈఓ విక్రమ్, వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.

దివ్యాంగుల సంక్షేమానికి కృషి చేయాలి



మాట్లాడుతున్న గోపాల్‌రెడ్డి

మార్కాపురం: జిల్లాలో దివ్యాంగుల సంక్షేమానికి అధికారులు సహకరించాలని వైఎస్సార్ సీపీ దివ్యాంగుల విభాగం అధ్యక్షుడు డి.గోపాల్‌రెడ్డి కోరారు. గురువారం పట్టణ మెప్మా కార్యాలయంలో దివ్యాంగుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2011లో జిల్లాలో 70 దివ్యాంగుల గ్రూపులు ఉన్నాయని, ఇప్పుడు 12 గ్రూపులే మిగిలాయన్నారు. సరైన అవగాహన లేకపోవడం, దివ్యాంగుల మధ్య ఐక్యత లోపించడం, అధికారుల సహకారం కొరవడటంతో అందరూ నిరుత్సాహంలో ఉన్నారన్నారు. మెప్మా అధికారులు సంక్షేమ పథకాలు అమలుచేసి దివ్యాంగుల ఉన్నతికి సహకరించాలని కోరారు. మెప్మా అధికారి ఎలీషా మాట్లాడుతూ దివ్యాంగుల అభ్యున్నతికి సహకరిస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఆర్పీలు, దివ్యాంగులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా రైల్వే యూనియన్ ఎన్నికలు



సీల్ వేసిన బ్యాలెట్ బాక్సు వద్ద రైల్వే పోలీసులు

మార్కాపురం: రైల్వే శాఖలోని ప్రధాన యూనియన్ల మధ్య గత రెండు రోజులుగా జరుగుతున్న ఎన్నికలు గురువారం సాయంత్రంతో ముగిశాయి. మొత్తం 292 ఓట్లకు గానూ 261 ఓట్లు పోలైనట్లు రైల్వే సిబ్బంది తెలిపారు. బ్యాలెట్ బాక్సులను గుంటూరు డీఆర్ఎం కార్యాలయానికి తరలించారు. ఈనెల 12వ తేదీన సికింద్రాబాద్‌లో ఓట్లు లెక్కించనున్నట్లు తెలిపారు. రైల్వే ఏఎస్సై వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో హెడ్ కానిస్టేబుల్ హరికృష్ణారెడ్డితో పాటు సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.